# బెగ్గరోళ్లు!

ముష్ఠి ప్రొడక్షన్స్ బేనర్‌లో ప్రప్రథమంగా తీయ తలపెట్టిన తెలుగు సినిమా కథ అప్‌కమింగ్ రైటర్ ముష్ఠి ముకుందరావు చెప్పిన తీరు దర్శక నిర్మాతలకు బోలెడు నచ్చింది.

సినిమా కథలో వినూత్న అంశం వుండటం ఓ ప్లస్‌పాయింటన్పించింది దర్శకేంద్రుడికి. అందుకు ప్రొడ్యూసర్స్ కూడా తలూపారు.

'బెగ్గరోళ్లు' అనే టైటిల్.... సినిమాకు సజెస్ట్ చేసిన రైటర్ ము.ము గారికి మరో యాభైవేల రూపాయల పారితోషికం అధికంగా ముట్ట చెప్ప నిర్ణయించుకున్నారు నిర్మాతలు.

ఈ పిక్చరు నిర్మాతలు నలుగురూ దిబెస్ట్ బెగ్గర్స్‌గ ఎన్నికై రాష్ట్ర ముఖ్యమంత్రి గారి చేతులు మీదుగ అవార్డ్ అందుకున్న వారు కావటం మరో విశేషం! వీరు నలుగురికి యాచక వృత్తిలో నిష్ణాతులు. నలభైయేళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతూ కోట్లు ఆర్జించారన్న సీక్రెట్ వారికి అవార్డ్ రావటంతో యావన్మందికీ ప్రసార సాధనాల ద్వారా బహిర్గతమై తెలిసిపోయింది.

నలుగురూ మంచి మిత్రులు... అత్యంత సన్నిహితులు కావటాన వారందరికీ కామన్ అయిడియా ఒకటి వచ్చింది.

అదేమిటన..?.. ఒక బెస్ట్ తెలుగు సినిమా నిర్మించాలీ అని! పిక్చర్ సక్సెసైతే తద్వారా కేవలం డబ్బే కాకుండా... దేశవ్యాప్తంగ తమకు మరింతపేరు ప్రఖ్యాతులు రాగల అవకాశమూ వుంటుందని సమిష్ఠిగా నలుగురు ముష్ఠి వారు ఆశించారు.

నిర్మాతలు ముష్ఠివారు కాబట్టి... తమ బేనర్ పేరు కూడా 'ముష్ఠి ప్రొడక్షన్స్'గా నిర్ణయించుకున్నారు. దర్శకుడిగా వీరముష్ఠి వీరభద్రం గారినే ఎన్నుకోవటంతో ఎంతో ఔచిత్యం అన్పించింది నిర్మాతలకు.

తెలుగు ఫిలిమ్ ఇండస్ట్రీని గాలించి జల్లెడపట్టి... మంచి రైటర్ కొరకు పడిన శ్రమ వృధా కాలేదు.

ఫీల్డులో అప్‌కమింక్ రైటర్ ముష్ఠి ముకుంద రావునే తమ తీయబోయే పిక్చర్‌కి కథ మాటలు రాయటానికి ఎన్నుకున్నారు.

ఫస్ట్ సిట్టింగులోనే నిర్మాతలకు అదిరిపోయే గొప్ప కథ చెప్పి సెభాష్ అన్పించుకున్నారు. ము.ము! కథ విని గుమ్మైపోయిన నిర్మాతలు క్షణం లేటు చెయ్యకుండా లక్ష ఎడ్వాన్సిచ్చి అగ్రిమెంట్ రాయించేసుకున్నారు.

ప్రప్రథమంగా పాటలు రాయించటాని కోసం బూతు పాటలు రాయటంలో సిద్ధహస్తుడైన

సాంగ్ రైటర్ కోసం అన్వేషించగా... గాలానికి చేప చిక్కినట్టు ఓ ప్రబుద్ధుడు తారసపడ్డారు. అతని నామధేయం సాంగేశ్వర్రావ్! ఇప్పటి వరకు రాసినవి అరడజనే అయినా అన్నీ హిట్టే!

ఆ కారణంగానే రెమ్యూనరేషన్ విషయంలో బేరమాడకుండా అయిదు పాటలు అతనే రాయాలని పట్టుబట్టి అడ్వాన్సిచ్చేశారు.

'బెగ్గరోళ్లు' పిక్చర్‌కి మ్యూజిక్ డైరక్టరుగా డోళ్ల సన్నాయిరావ్‌ని ఖాయం చేసుకున్నారు. ఆలిండియాలో వున్న అన్ని భాషల సినిమాలకు సంగీత సారథ్యం వహించిన వాడు కావటాన అతడినే ఎన్నుకున్నారు.

ఆడియో విడుదల సందర్భాన్ని పురస్కరించుకుని 'బెగ్గరోళ్లు' సినీమా నిర్మాతలు పేపరోళ్లందరినీ పిల్చి విందిచ్చి...పాటలు అద్భుతంగా వున్నాయంటూ రాయమని కాళ్లావేళ్లా పడ్డారు.

పాత్రికేయులు అడిగి ప్రశ్నలు నిర్మాతలను కొంత తికమక పెట్టినా... దర్శకుడు... రైటర్ ముష్టి ముకుందరావు కూడా అక్కడే వుండటంతో ఇబ్బంది గట్టెక్కినట్టయ్యింది.

సినిమా కథ గురించి క్లుప్తంగా వివరించమని ఓ విలేఖరి కోరగా..

రైటర్ ముష్టి ముకుందరావు గొంతు సవరించుకుని 'పిక్చర్లో ఆర్టిస్టులంతా బ్రాండ్‌న్యూ! అన్నీ కొత్తముఖాలే! రాష్ట్రం మొత్తం తిరిగి టార్చ్‌లైట్ వేసి మూలమూలలా వెతికి టాలెంట్ ఉన్న వారిని ఎన్ను కున్నాం! మా కథలో... ముగ్గురు హీరోలు ముగ్గురు కథానాయికలు.

హీరోయిన్లు ముగ్గురూ మూగవాళ్లు! పిక్చర్లో డైలాగ్ ట్రాక్ స్వల్పం! అమ్మాయిల అవయవ సౌందర్యం... అంగ సౌష్ఠవం ముఖ్యం కాబట్టి... పాత్రలకు తగిన వారినే ఎంచుకుని స్క్రీన్ టెస్ట్‌లో నెగ్గిన వారినే సెలక్ట్ చేశాం!

హీరోలు ముగ్గురూ ముష్టివాళ్లు! ఒకడు గుడ్డి రెండో వాడు మూగ.. మూడో అతను కుంటి!

డబ్బున్న మూగ హీరోయిన్లు ముగ్గురూ బెగ్గర్ హీరోస్‌ని ప్రేమిస్తారు!

అదే మా కథలో నూతనత్వం! కథనం అద్భుతంగా వుంటుంది. పిక్చర్ చూసి కన్నీరు పెట్టని వారుండరంటే నమ్మండి! కామెడీ క్కూడా పిక్చర్లో పెద్దపీట వేశాం. సాంగ్స్ అన్నీ అద్భుతంగా వచ్చినయ్.

ఒక్కో సాంగ్ ఒక్కో దేశంలో షూట్ చేయ తలిచాం.

పిక్చర్ వివరాలు గుక్కతిప్పుకోకుండా నేరేట్ చేసాడు రచయిత ముష్టి ముకుందరావు.

విడుదల చేస్తున్న పాటల కేసెట్‌కూడా ఒక పేద ముష్టి వాడిచేత చేయించటం మా బేనర్ ప్రత్యేకత.

షూటింగ్ ప్రారంభోత్సవానికి కూడా ఓ వృద్ధ బెగ్గర్ని ఆహ్వానించి అతనితో క్లాప్ 'కొట్టించాలని తీర్మానించాం... నిర్మాతలు కలుగ చేసుకుని మరికొన్ని వివరాలు పాత్రికేయులకందించారు.

ఈ పిక్చర్ సక్సెస్ అవుతుందని అనుకుంటున్నారా?-మరో పాత్రికేయుని ప్రశ్న.

శుభం పలకరా అంటే ఇదేం బోడి ప్రశ్న... డైరెక్టర్ మనసులో తిట్టుకున్నాడు.

పిక్చర్ అడదని మాకేం భయం లేదు...ఎందు కని అంటారా?- బెగ్గర్స్ అసోసియేషన్‌కి రాష్ట్ర కార్యదర్శిని నేను! మాకు పోటీ అసోసియేషన్లు... యూనియన్లు మాలో లేవు. రాజకీయాల్లో లక్ష పార్టీలు, రకరకాల జండాలూ వుంటాయేమోగాని... మాకు ఆ బాధ లేదు. ప్రేక్షకులు మా సినీమాను ఆదరించక పోయినా.. రాష్ట్రంలో వున్న పదికోట్ల మంది బిక్షగాళ్లు... ముష్టివాళ్లు చూస్తే చాలు! మా డబ్బులు మాకొచ్చేస్తాయ్...'వికటాట్టహాసం చేస్తూ నలుగురి పార్టనర్స్‌లో ఒకాయన మాట్లాడాడు.

'ఐతే ఇంకేం? గో ఎహెడ్ సర్! మీకు తిరుగే వుండదు...' ఓ విలేఖరి మాట్లాడాడు.

"మీరు సినీమా తీయటానికి ఇటు వంటి కథాంశాన్ని ఎందుకు ఎన్నుకున్నారో వివరిస్తారా? ఓ కుర్ర విలేకరి విసిరిన ప్రశ్న.

'మీరు కొరిన దానికి వివరణ విపులంగ ఇస్తాను. సావధాన చిత్తులై శ్రద్ధగా వినండి... ' అంటూ మొదలు పెట్టాడు ముష్టి ముకుందరావు.

ఉదాహరణకు నన్నే తీసుకోండి! మా ఇంటి పేరు ముష్టివారు. పూర్వీకులు వ్యాయవారం చేసుకు బతికేవారట!

ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలు కనుక.. అప్పట్లో... అంటే అయిదారు వందల ఏళ్ల క్రితం... బతుకు గడవక... సంసారాలను పోషించగల శక్తి లేక .. పగటి వేషగాళ్లుగా... వీధి భాగవతులుగా... ధనవంతులను ఆశ్రయిస్తూ వారు విదిలించే ధనంతో ఒక పూట గడచి.. మరో పూట గడవక నానా ఇబ్బందులు పడుతూండగ చివరి ప్రయత్నంగా జమీందారులను ఆశ్రయించి.. వారి అనుగ్రహంతో అగ్రహారాలు సంపాదించి పైకొచ్చారట. అగ్రహారాలను రాసిస్తూ ఇకపై ముష్టెత్తుకో అవసరం లేదు కాబట్టి... మీ ఇంటిపేరు 'ముష్టి' వారుగ పెట్టుకుని హాయిగా జీవించండి అంటూ ఆశీర్వదించారట!

చూశారా! మాఇంటి పేరు వెనుక ఎంతటి కథ దాగుందో?

ఇలాంటి కథాంశాన్ని సినిమా తీయాలని సంకల్పించిన నిర్మాతలకు మరో ఆలోచన కూడా నే చెప్పగా నచ్చింది అదేమిటన?

ఈ రోజుల్లో 'బెగ్గింగ్' ఓ హక్కుగా పరిణమించింది.

మనిషైన ప్రతివ్యక్తి నా దృష్టిలో ఒక బెగ్గరే! ఎంచేతనంటారా?

రాజకీయ నాయకుడు ఎన్నికల్లో నిలబడి ఓట్లకోసం బెగ్ చేస్తాడు. ఉద్యోగులు లంచం కోసం బెగ్ చేస్తారు. పిల్లల్ని కాజేసే మూఠాలు తమ ఆధీనంలో వుండే పిల్లలని బెగ్గర్స్‌గా తయారు చేస్తారు.

అసలు బెగ్గింగ్ అనే పదం సొసైటీలో పవర్‌ఫుల్ వాడుక పదమైంది.

కొడుకు తండ్రిని పాకెట్ మనీ అడిగితే.. తండ్రి ఇచ్చిన పది రూపాయలతో తృప్తి పడకపోగా... ఇచ్చావులే ముష్టి పది రూపాయలు అని కామెంట్ చేయటం మనం చూస్తుంటాం!

కొత్తగా వుద్యోగంలో చేరిన వ్యక్తి తన నెల జీతం గురించి చెప్తే... ఓస్! నీ శాలరీ ముష్టి మూడు వేలేనాని? హేళన చేయటం గమనార్హం.

థియేటర్ దగ్గర కెళ్లి చాంతాడంత 'క్యూ' చూస్తూ తనకు టిక్కెట్లు దొరకవేమోనే బెంగతో 'ముష్టి సినిమాకు టిక్కెట్లు కోసం తోపులాటలు... తన్నుకు చావటం అవసరం... అంటూ తన్లోవుండే కోపాన్నీ అసంతృప్తినీ ఆ రూపంలో ప్రదర్శిస్తాడు.

ఓ నిరుద్యోగికి కోపమొచ్చి ఈ ముష్టి వుద్యోగం కోసమా?... తాను ముష్టి డిగ్రీ సంపాదించింది... అనేసి తన అసమర్థతను వ్యక్తీకరిస్తాడు.

అంటే 'ముష్టి' అనే పదం సరిగ్గా వాడి అది 'పంచ్' అయితే కథ జనానికి ఎక్కుతుంది. సీన్లు పండుతయ్! పిక్చర్ సక్సెసౌతుంది. నిర్మాతలకు డబ్బులొస్తాయ్. సినిమా చూచిన ప్రేక్షకుడికి ఆనందం మిగుల్తుంది.

కావున... విలేఖరి మహాశయా! మా ఈ ముష్టి ప్రయత్నం... అంటే 'బెగ్గరోళ్లు' సినిమా బాగా పంచ్ అవుతుంది సార్... అంటూ వివిధ రూపాల్లో 'ముష్టి' గురించి ఎనలైజ్ చేసాడు ముష్టి ముకుందరావు.

'ముష్టి' అనే పదానికి ఇంత డెప్త్ వుందాని అక్కడున్న వారంతా నోళ్లు వెళ్లబెట్టారు.

'బెగ్గర్స్' అనే వారిని నిర్మూలించాలని ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. వీరికి ఫ్రీగా ఇళ్ల స్థలాలు... బ్యాంకులోన్లు... ఇప్పించి యాచకవృత్తి మాన్పించాలనేది ప్రభుత్వ ధ్యేయం. ఆ సంకల్పం ఈ జన్మలో నెరవేరగల అవకాశాలు మాత్రం కన్పించటం లేదు.

యాచన (ముష్టెత్తుకోవటం) మాన్పించి మనిషికో వెయ్యి రూపాయలు భృతి ప్రవేశపెట్టి బెగ్గర్స్‌ని ఆర్థికంగా ఆదుకుంటే ఎలావుంటుందనే ఆలోచన ఆ చరణ సాధ్యంగాలేదేమో..లేక అసలే లోటు బడ్జెట్లో వున్న రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు భారం అవుతుందనో.. తమ యాచకుల నిర్మూలన కార్యాచరణ పథకానికి స్వస్తిచెప్పారు. అన్నాడు ముష్టి ముకుందరావు తేలిగ్గా నవ్వేస్తూ...

'మీ పిక్చర్ 'బెగ్గరోళ్లు' విజయవంతం తప్పక కావాలని ఆకాంక్షిస్తూ... మా శక్తి వంచన లేకుండా పేపర్ మీడియా పబ్లిసిటీ ఇవ్వగలమంటూ ప్రామిస్ చేసిన పాత్రికేయులు లేచి నిలబడి నిష్క్రమించారు.

-:(సమాప్తం):-